ఏకమవుతున్న తెలంగాణ ద్రోహులు

- కేసీఆర్‌కు వ్యతిరేకంగా చంద్రబాబు, పవన్, షర్మిల ముఠా
- పవన్ బీజేపీకి, షర్మిల కాంగ్రెస్‌కు ఓటేయాలని అంటున్నరు
- ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలవద్దనే వైదొలగిన చంద్రబాబు
- మన తెలంగాణ గెలవాలంటే మన కేసీఆర్‌కు ఓటేయాలి
- స్ట్రాంగ్‌లీడర్ కేసీఆర్ ఉండగా.. రాంగ్ లీడర్లు మనకెందుకు?
- రేవంత్‌రెడ్డి క్రిమినల్, బెయిల్‌మీద ఉన్న ఖైదీ: మంత్రి హరీశ్

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో నిర్వహించిన సమావేశానికి హాజరైన ముఖ్య కార్యకర్తలు, నాయకులు

సంగారెడ్డి, నవంబర్ 3(నమస్తే తెలంగాణ): వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌ను దెబ్బకొట్టేందుకు తెలంగాణ ద్రోహులు, వ్యతిరేకులు ఏకమవుతున్నారని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల ఒక్కటై ముఠా కట్టారని ఆరోపించారు. ఈ ఎన్నికలు తెలంగాణ ద్రోహులు, నికార్సయిన తెలంగాణ బిడ్డ కేసీఆర్ మధ్యే పోటీ అని స్పష్టం చేశారు. తెలంగాణ గెలవాలంటే కేసీఆర్ కారుకు ఓటు వేయాలని కోరారు. కేసీఆర్ లాంటి స్ట్రాంగ్ లీడర్ ఉండగా కాంగ్రెస్, బీజేపీలోని రాంగ్ లీడర్లు మనకెందుకని ప్రశ్నించారు. కేసీఆర్ సీఎం కాకుంటే అభివృద్ధిలో తెలంగాణ 20 ఏండ్లు వెనక్కి వెళ్లే ప్రమాదముందని హెచ్చరించారు. సంగారెడ్డి, జహీరాబాద్‌లో శుక్రవారం పర్యటించిన మంత్రి హరీశ్‌రావు సంగారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్, జహీరాబాద్ అభ్యర్థి కొనింటి మాణిక్‌రావు ఆధ్వర్యంలో జరిగిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పవన్ కల్యాణ్‌కు తెలంగాణ రావడం ఇష్టం లేదని, తెలంగాణ ప్రకటించినప్పుడు భోజనం మానేశానని చెప్పాడని గుర్తు చేశారు.

> ఓటుకు నోటుకేసులో పట్టపగలే దొరికిన దొంగ రేవంత్. చర్లపల్లిలో ఖైదీ నంబరు 4170గా, చంచల్‌గూడలో ఖైదీ నంబర్ 1179గా గడిపాడు. కాంగ్రెస్ పార్టీని, ఎమ్మెల్యే టికెట్లను రేవంత్ అమ్ముకుంటున్నాడని సొంత పార్టీ నేతలే ఆరోపిస్తున్నారు. తెలంగాణ వద్దన్న చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబాలకు, సమైక్యవాదులకు రేవంత్ ఊడిగం చేస్తున్నడు.
>
> -మంత్రి హరీశ్‌రావు

తెలంగాణ వ్యతిరేకి అయిన పవన్ బీజేపీతో జతకట్టారని తెలిపారు. తెలంగాణ వ్యతిరేకతను నరనరాన జీర్ణించుకున్న షర్మిల బరి నుంచి తప్పుకుని కాంగ్రెస్‌కు ఓటేయాలని చెబుతున్నారని పేర్కొన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు లోపాయికారీగా కాంగ్రెస్‌కు సహకరిస్తున్నట్టు తెలిపారు. తెలంగాణను దెబ్బతీసేందుకు, తెలంగాణను ఆగం చేసేందుకు తెలంగాణ ద్రోహులు కాంగ్రెస్, బీజేపీ ముసుగులో బయలుదేరినట్టు ఆరోపించారు. ఎన్నికల్లో కిందమీద అయితే తెలంగాణ ఆగం అవుతుందని హెచ్చరించారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండి తెలంగాణ ద్రోహులకు బుద్ధి చెప్పాలని, కేసీఆర్‌కు అండగా ఉండాలని పిలుపునిచ్చారు.

రేవంత్ బెయిలుపై ఉన్న ఖైదీ

పీసీసీ అధ్యక్షుడు బెయిలుపై ఉన్న ఖైదీ అని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ రైతులు, ఉస్మానియా విద్యార్థులను రేవంత్ రెడ్డి అవమానించారని, ఉస్మానియా విద్యార్థులు బీర్లు, బిర్యానీలకు అమ్ముడుపోతారని కించపరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒక్కటేనని తెలిపారు. ఎన్నికల్లో అవి రెండూ పరస్పరం సహకరించుకుంటున్నట్టు మంత్రి తెలిపారు.

టీకాంగ్రెస్‌ను డీకే బొందపెట్టిండు

కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలంగాణలో ప్రచారం చేసి కాంగ్రెస్‌ను బొందపెట్టారని మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. రైతులకు 24గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్న తెలంగాణకు వచ్చిన శివకుమార్ తాండూరు సభలో మాట్లాడుతూ.. కర్ణాటకలో తాము ఐదు గంటల కరెంటు ఇస్తున్నట్టు చెప్పి టీకాంగ్రెస్‌ను హిట్‌వికెట్ చేశారని పేర్కొన్నారు. సంగారెడ్డిలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తే ఖర్గే బహిరంగ సభకు మించి జనం వచ్చారని గుర్తు చేశారు. ఎమ్మెల్యేగా గెలిచాక జగ్గారెడ్డి ఏనాడూ నియోజకవర్గంలో పర్యటించలేదని, ఓటర్లు ఆయనను నమ్మే పరిస్థితి లేదని తేల్చి చెప్పారు. ప్రజలకు పనికిరాని జగ్గారెడ్డిని ఓడించి, చింతా ప్రభాకర్‌ను గెలిపించాలని కోరారు.

ఈ విషయాన్ని ముస్లింలు గమనించాలి

తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటైన విషయాన్ని ముస్లింలు గమనించాలని, బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటేనని కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాన్ని నమ్మవద్దని కోరారు. బీఆర్ఎస్, బీజేపీ ఎప్పటికీ ఒక్కటి కావన్నారు. కేసీఆర్ సిసలైన సెక్యులర్ నేత అని, తెలంగాణలో తొమ్మిదేండ్లలో ఒక్క కర్ఫ్యూ కూడా లేదని గుర్తు చేశారు. సమావేశంలో ఎంపీ బీబీ పాటిల్, కార్పొరేషన్ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, నరోత్తం, తన్వీర్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్ఎస్ నేతలు పట్నం మాణిక్యం, దేవీప్రసాద్, మామిళ్ల రాజేందర్, బుచ్చిరెడ్డి, నరహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను నమ్మితే రిస్కు తప్పదు

కాంగ్రెస్‌ను నమ్మితే రిస్కు తప్పదని ప్రజలను మంత్రి హరీశ్‌రావు హెచ్చరించారు. చావు నోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌కు ఓటువేసి హ్యాట్రిక్ సీఎంను చేయాలని పిలుపునిచ్చారు. కేసీఆర్‌కు వ్యతిరేకంగా రేవంత్‌రెడ్డి క్రిమినల్ గ్యాంగ్ కుట్ర పన్నుతున్నదని ఆరోపించారు. తెలంగాణ గెలవాలంటే కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. కర్ణాటకలో కాంగ్రెస్‌కు ఓటేసి అక్కడి ప్రజలు మోసపోయారని, ఐదు గంటల కరెంటుతో బతుకులు ఆగమయ్యాయని స్వయంగా రైతులే చెబుతున్న విషయాన్ని గుర్తు చేశారు. కేసీఆర్‌లాంటి స్ట్రాంగ్ లీడర్ ఉండగా కాంగ్రెస్‌లోని రాంగ్ లీడర్లు మనకెందుకని ప్రశ్నించారు. సోషల్ మీడియా ప్రచారాన్ని చూసి ఆగం కావొద్దని పార్టీ నాయకులు, కార్యకర్తలను కోరారు. ప్రజల్లో బలం లేనోడు, పనికిరానివాళ్లు మాత్రమే సోషల్ మీడియాలో ప్రచారం చేస్తారని పేర్కొన్నారు. మ్యానిఫెస్టోను, అభివృద్ధిని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లి ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలంలోని నాగులమల్యాలలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

కాంగ్రెస్, బీజేపీని నమ్మితే రాష్ట్రం అధోగతే

- 50 ఏండ్ల కష్టాలు మళ్లీ తెచ్చుకోవద్దు
- కరీంనగర్ ఎన్నికల ప్రచారంలో అభ్యర్థి గంగుల హెచ్చరిక

కరీంనగర్ కార్పొరేషన్, నవంబర్ 3: ఎన్నికల్లో విపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మి ఓట్లేస్తే.. తెలంగాణ మరోసారి అధోగతి పాలవుతుందని, 50 ఏండ్ల కష్టాలను మళ్లీ కొనితెచ్చుకోవద్దని బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి, బీఆర్ఎస్ కరీంనగర్ అభ్యర్థి గంగుల కమలాకర్ హెచ్చరించారు. శుక్రవారం కరీంనగర్ నియోజకవర్గంలో మంత్రి విస్తృత ప్రచారం చేపట్టారు. ఉదయం కొత్తపల్లి మండలంలోని నాగులమల్యాల, కొండాపూర్, ఐలోనిపల్లి గ్రామాల్లో ప్రచారం సాగించారు. మధ్యాహ్నం జిల్లా కేంద్రంలోని వైశ్యభవన్‌లో పట్టణ వ్యాపార, వర్తక సంఘం, ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం ఆధ్వర్యాల్లో జరిగిన ఆత్మీయ సమ్మేళనాల్లో పాల్గొన్నారు. సాయంత్రం నగరంలోని 14, 15, 16 డివిజన్లలో ఇంటింటి ప్రచారం సాగించారు. మంత్రి మాట్లాడుతూ.. సమైక్య పాలనలో గ్రామాలకు సరైన రోడ్లు కూడా లేవన్నారు. చెరువులన్నీ ఎండిపోయి కనిపించేవని గుర్తు చేశారు. తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుతో మండుటెండల్లోనూ చెరువులు మత్తళ్లు దుంకుతున్నాయని చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ సాగునీరు, తాగునీరుకు ఎక్కడా ఇబ్బంది లేదని వివరించారు. ప్రస్తుత అభివృద్ధి కొనసాగాలంటే కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. తనకు మరోసారి అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. వేదికపై ఎమ్మెల్యే రవీంద్రకుమార్, చెరుకు సుధాకర్, బీల్యానాయక్ తదితరులు

ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్‌ను నిలదీయాలి

దేవరకొండ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి జగదీశ్‌రెడ్డి

దేవరకొండ, నవంబర్ 3: అరవయ్యేండ్ల పాలనలో కాంగ్రెస్ ఏం చేసిందో చెప్పాలని ఓట్లు అడుగడానికి వస్తున్న ఆ పార్టీ నాయకులను నిలదీయాలని విద్యుత్తు శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నల్లగొండ జిల్లా దేవరకొండలో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెసకు ఓటేస్తే.. రైతుబంధు, రైతు బీమా, 24 గంటల విద్యుత్తు బందవుతాయని హెచ్చరించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలు నమ్మరని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో పోటీ చేయని కాంగ్రెస్ నాయకుడు.. తాను ముఖ్యమంత్రి అవుతానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో పదిమంది ముఖ్యమంత్రి అభ్యర్థులు ఉన్నారని, వారి కొట్లాటలతోనే సరిపోతుందని, ప్రజల బాగోగులను పట్టించుకునే పరిస్థితి ఉండదని వివరించారు. మూడో సారి ముఖ్యమంత్రి కాగానే కేసీఆర్ రాష్ట్రంలో ఉన్న 93 లక్షల మంది తెల్లరేషన్ కార్డుదారులకు సన్నబియ్యం అందించే కార్యక్రమం చేపట్టనున్నట్టు చెప్పారు. సీఎం కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రాగానే రూ.400లకే గ్యాస్ సిలిండర్ అందిస్తారని చెప్పారు. ఈ సమావేశంలో దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చెరుకు సుధాకర్, కేతావత్ బీల్యానాయక్, వడ్త్య రమేశ్‌నాయక్, హన్మంత్ వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏ ముఖం పెట్టుకొని మా ఊరికొచ్చినవ్?

- మోత్కులపల్లిలో పొన్నం ప్రభాకర్‌ను నిలదీసిన గ్రామస్థులు

అక్కన్నపేట, నవంబర్ 3: 'ఏ ముఖం పెట్టుకొని మా ఊరికొచ్చినవ్' అంటూ హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌ను.. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం మోత్కులపల్లి గ్రామస్థులు నిలదీశారు. శుక్రవారం రాత్రి పొన్నం ప్రభాకర్ మోత్కుపల్లిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారాన్ని గ్రామస్థులు బీఆర్ఎస్ నాయకులతో కలిసి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. మెట్ట ప్రాంత వరదాయిని గౌరవెల్లి ప్రాజెక్ట్ పనులు తుది దశలో ఉండగానే.. కాంగ్రెస్ నాయకులు భూ నిర్వాసితులతో కలిసి కేసులు వేయించారని, ప్రాజెక్ట్ పూర్తయితే ప్రతిపక్షాలకు డిపాజిట్ దక్కదనే భయంతో కుట్రలు చేశారని విమర్శించారు. రైతులకు రైతుబంధు ఇవ్వొద్దని, పంట రుణ మాఫీ చేయొద్దని, ఆసరా పంఛన్లు ఆపాలని ఈసీకి కాంగ్రెస్ ఫిర్యాదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇలా అభివృద్ధిని అడుగడుగునా అడ్డుకుంటూ.. సంక్షేమాన్ని విస్మరించే పార్టీలకు ఓట్లు వేయబోమని పొన్నం ప్రభాకర్ ఎదుటే తేల్చిచెప్పారు. మా ఊరు ఓట్లు అడగకుండా వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. దీంతో చేసేది లేక పొన్నం ప్రభాకర్ అక్కడి నుంచి వెళ్లిపోయినట్టు స్థానికులు తెలిపారు.

కారు గుర్తుకే చింతల్లపల్లి వాసుల ఓటు

- సుంకె రవిశంకర్‌ను గెలిపిస్తామని గ్రామస్థుల ఏకగ్రీవ తీర్మానం

కొడిమ్యాల, నవంబర్ 3: చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం చింతల్లపల్లి గ్రామస్థులు జై కొట్టారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకే ఓటేసి, సుంకె రవిశంకర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని ఏకగ్రీవంగా తీర్మానించారు. తీర్మాన కాపీని పార్టీ మండల నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందని, తమ గ్రామం ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారని, దీనికి కృతజ్ఞతగా గ్రామం మొత్తం కారు గుర్తుకు ఓటు వేయాలని తీర్మానించిందని వెల్లడించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ మేన్నేని రాజనర్సింగరావు, పోలు రాజేందర్, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, సర్పంచ్ మల్యాల మహిపాల్, ఎంపీటీసీ సభ్యులు సామల్ల లక్ష్మణ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పులి వెంకటేశంగౌడ్, రైతుబంధు మండల కన్వీనర్ అంకం రాజేశం, పాదం శ్రీనివాస్, రాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

దొంగలకు టికెట్లు అమ్ముకున్న రేవంత్

- పార్టీ అభివృద్ధి కోసం రాహుల్ గాంధీ పాదయాత్ర
- డీసీసీబీ మాజీ చైర్మన్ రాఘవరెడ్డి

కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జంగా రాఘవరెడ్డి

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 3: దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలో తీసుకొచ్చేందుకు రాహుల్‌గాంధీ పాదయాత్ర చేస్తే.. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి దొంగలకు టికెట్లు అమ్ముకొని పార్టీని సర్వనాశనం చేస్తున్నారని డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మండిపడ్డారు. శుక్రవారం హనుమకొండ హంటర్‌రోడ్‌లోని విష్ణుప్రియ గార్డెన్‌లో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ.. భూములు కబ్జా చేసి, పేదలకు పంచాల్సిన ఇందిరమ్మ ఇండ్లు అమ్ముకున్న నాయిని రాజేందర్‌రెడ్డికి రేవంత్ టికెట్ ఇచ్చారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ కుటుంబాన్ని, తాను నమ్మిన నాయకుడు రాహుల్ గాంధీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా రాష్ట్ర నాయకత్వం పనిచేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. జంగా రాఘవరెడ్డి గెలిస్తే అందరిని నిలదీస్తాడని ఇక్కడి నాయకులు టికెట్ రాకుండా అడ్డుకున్నారని చెప్పారు. సింహం గుర్తుపై స్వతంత్రంగా పోటీ చేస్తున్నానని, స్వతంత్రంగా గెలిచి కాంగ్రెస్ పార్టీలోనే చేరుతానని జంగా రాఘవరెడ్డి స్పష్టం చేశారు. ఇక్కడి ప్రజలు కాంగ్రెస్ నాయకులకు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. సింహం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని జంగా ప్రజలను కోరారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్‌యాదవ్, రజాలీ, నగర మాజీ అధ్యక్షుడు కట్ల శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ రేపల్లె శ్రీనాథ్, యువజన నాయకులు రంగనాథ్, కొడిపాక గణేశ్, గుజ్జుల శ్రీనివాస్‌రెడ్డి, ధన్‌రాజ్, యాకూబ్‌రెడ్డి, కత్తుల కవిత, విజయ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన కిషన్‌నాయక్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బీరం, అభిలాష్‌రావు

జూపల్లిని నమ్మి మోసపోయిన

- మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్
- ఎమ్మెల్యే బీరం సమక్షంలో తిరిగి బీఆర్ఎస్‌లోకి

కొల్లాపూర్, నవంబర్ 3: కాంగ్రెస్ నాయకుడు, మోసకారి జూపల్లి మాటలను ఎవరూ నమ్మొద్దని, ఆయనను నమ్మి పార్టీ మారి మోసపోయానని కొల్లాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బీరం, పార్టీ రాష్ట్ర నేత రంగినేని అభిలాష్‌రావు సమక్షంలో కిషన్‌నాయక్ తిరిగి గులాబీ గూటికి చేరారు. ఈ సందర్భంగా నాయక్ మాట్లాడుతూ.. మోసగాడు జూపల్లి మాటలు నమ్మి పార్టీ మారి తాను ఎంతో మానసిక క్షోభ అనుభవించి పశ్చాతాపంతో తిరిగి సొంత పార్టీలో చేరినట్టు చెప్పారు. జూపల్లి నిజస్వరూపం తెలుసుకొని మిగితా వారు కూడా గులాబీ పార్టీలోకి రావాలని ఆయన సూచించారు. బీరం తనను సొంత అన్నలాగా ఆదరించారని తెలిపారు. అనంతరం బీరం మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సహకారంతో కొల్లాపూర్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌ను ప్రజలు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కయ్యం.. కాంగ్రెస్ నైజం

- ఎన్నికలైనా, పార్టీ భేటీలైనా తన్నులాట కామన్
- గాంధీభవన్‌కు నిలువెల్లా గాయాలు
- సొంత పార్టీ నేతలు, కార్యకర్తల చేతిలో అవమానాలు
- ఘర్షణలు, నిరసనలు, వర్గ పోరాటాలు నిత్యకృత్యం
- దశాబ్దాలుగా కాంగ్రెస్ చరిత్ర అంతా ఇంతే

గురువారం గాంధీభవన్ ఎదుట బైఠాయించిన అసంతృప్త నేతల అనుచరులు

హైదరాబాద్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): దేశంలోనే సుదీర్ఘ చరిత్ర ఉన్న పార్టీగా చెప్పుకుంటున్నా.. నియమాలు, నైతికత, సంస్కారాన్ని మర్చిపోవడం కాంగ్రెస్ పార్టీ నేతలకు వెన్నతో పెట్టిన విద్యగా మారింది. వారిలో వారు ఘర్షణలకు దిగడం, దాడులకు తెగబడటం, వర్గపోరుతో బహిరంగ వేదికలపైనే వాదులాడుకోవటం నిత్యకృత్యమైపోయింది. తమ పార్టీలో ఇదంతా అంతర్గత ప్రజాస్వామ్యం అని వారు ఎంత సర్దిచెప్పుకోవటానికి ప్రయత్నించినా.. సొంతపార్టీ కార్యాలయాలపై దాడులు, సొంత పార్టీ జెండాలనే తగలబెట్టుకోవటం చూసేవాళ్లకు ఏవగింపు కలిగిస్తున్నాయి. ప్రజా సమస్యలపై స్పందనల కంటే అంతర్గత ఘర్షణలతోనే ఆ పార్టీ మీడియాలో ప్రధానంగా కనిపిస్తున్నది.

గాంధీభవన్‌పై కాంగ్రెస్ క్యాడర్ దాడులు

- కాంగ్రెస్ పార్టీ అంటేనే వర్గపోరుకు ఐకాన్‌గా చెప్పుకునే పరిస్థితి మొదటి నుంచి ఉన్నది. తెలంగాణ ఉద్యమం.. సమైక్య పాలకుల కాలంలోనూ పార్టీ ప్రధాన కార్యాలయం గాంధీభవన్ అరుపులు, పెడబొబ్బలు, దాడులు, ఘర్షణలతో అట్టుడికేది. ఉదాహరణకు కొన్ని ఘటనలు..
- 2014 సెప్టెంబర్ 1 నాడు ఏఐసీసీ కార్యదర్శి ఆర్‌సీ కుంతియా, అప్పటి పీసీసీ అధ్యక్షుడి సమక్షంలోనే ఖమ్మం జిల్లా నేతలైన రేణుకాచౌదరి, ఆర్ వెంకట్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి వర్గాలు పరస్పరం దాడులకు దిగాయి. అదేరోజు దుబ్బాకలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశం (మెదక్ లోక్‌సభ ఉప ఎన్నికలు) సందర్భంగా ఫ్లెక్సీలో ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ ఫొటో లేకపోవడంతో ఆయనకు, జానారెడ్డికి మధ్యన తీవ్ర వాగ్వాదం జరిగింది. ఇదే సమయంలో సమావేశం హాలు బయట ఇరు వర్గాలు పరస్పరం దూషించుకోవడంతో గందరగోళం ఏర్పడింది. ఆపై అప్పటి మాజీ ఎమ్మెల్యే ముత్యంరెడ్డి, సంజీవరెడ్డి మధ్య తోపులాట జరిగింది.
- 2019 ఫిబ్రవరి 2 నాడు కాంగ్రెస్ నేతల ఆధిపత్య పోరుకు గాంధీభవన్ వేదికగా మారింది. ఓబీసీ సెల్ అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్కకు సన్మాన కార్యక్రమంలో శ్రీకాంత్ గౌడ్, వీ హన్మంతరావు బూతులు తిట్టుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య పిడిగుద్దులు, తోపులాటలు తప్పలేదు. శ్రీకాంత్ అనుచరులు వీహెచ్‌పై దాడి చేశారు.
- 2014 ఏప్రిల్ 2 నాడు ఎన్నికల్లో టికెట్లకు సంబంధించి పలు నియోజకవర్గాల నేతలు, కార్యకర్తలు గాంధీభవన్ ముందు ధర్నా నిర్వహించారు. అసంతృప్తులు దాడి చేస్తారనే భయంతో గాంధీభవన్‌లో సుమారు పది మంది బౌన్సర్లతో భద్రత ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. మైనారిటీలకు తగిన ప్రాతినిధ్యం ఇవ్వలేదని మైనారిటీ విభాగం అధ్యక్షుడు సిరాజుద్దీన్ ఆధ్వర్యంలో కార్యకర్తలు గాంధీభవన్‌లోకి చొచ్చుకెళ్లి పీసీసీ అధ్యక్షుడి కార్యాలయం ముందే ధర్నాకు దిగారు.
- 2019 మార్చి 4న గాంధీభవన్ ముందు ధర్నాలు, రాస్తారోకోలు షురూ మామూలయ్యాయి. నాగర్‌కర్నూల్ లోక్‌సభ టికెట్టు ఆశించిన సతీశ్‌మాదిగ, మాజీ ఎమ్మెల్యే సంపత్ వర్గీయులు గాంధీభవన్‌లో హంగామా సృష్టించారు.
- 2018, నవంబర్ 4న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మహాకూటమిగా ఏర్పడక ముందే సీట్ల కోసం నాయకులు జుట్లు పట్టుకుని దాడులకు దిగారు. శేరిలింగంపల్లి టికెట్ ఆశించిన నాయకుల అనుచరులు పరస్పరం రాళ్లదాడులు చేసుకొన్నారు. మరో నేత అనుచరులు గాంధీభవన్ ఎదుట ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించగా.. మరో అనుచరుడు బ్లేడ్‌తో చేతిని కోసుకుని నిరసన తెలిపాడు.
- 2019, నవంబర్ 5న సీనియర్ నేత గులాంనబీ ఆజాద్ సమక్షంలో గాంధీభవన్‌లో వీ హనుమంతరావు, షబ్బీర్ అలీ పరస్పరం పరుష పదజాలంతో తిట్టుకున్నారు. అదే సమయంలో పీసీసీ పదవి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఇవ్వాలంటూ ఆయన అనుచరులు నినాదాలు చేస్తుండగా.. కొందరు ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. ఆజాద్ ఎదుట బైఠాయించారు.
- 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ సారథ్యంలో మహాకూటమిగా ఏర్పడిన పార్టీల నేతలు, కార్యకర్తల దాడులు, ప్రతిదాడులు, నిరసనలు, ఘర్షణలతో గాంధీభవన్ దద్దరిల్లింది. 9.11.2018 నాడు ఇలా ఆందోళన చేసేవారిని అడ్డుకునేందుకు ఏకంగా గాంధీభవన్‌కే తాళం వేయాల్సి వచ్చింది. కొందరు కార్యకర్తలు పెట్రోల్ పోసుకుని ఆత్మాహుతికి ప్రయత్నించడంతో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. ఉప్పల్, నకిరేకల్, మల్కాజిగిరి, ఖానాపూర్ తదితర నియోజకవర్గాల నుంచి వచ్చిన కాంగ్రెస్ శ్రేణులు ధర్నాలు, మౌన ప్రదర్శనలు, అర్ధనగ్న ప్రదర్శనలు, నిరాహార దీక్షలకు దిగారు.
- 12.3.2014 నాడు గాంధీభవన్‌లో ఏఐసీసీ నేత, పీసీసీ అధ్యక్షుడి సమక్షంలోనే నేతలు, కార్యకర్తలు బాహాబాహీకి దిగారు. కుర్చీలతో కొట్టుకున్నారు. కుర్చీలు విసురుకోవడంతో మీడియా హాలు తలుపుల అద్దాలు పగిలాయి.
- 22.12.2022 నాడు గాంధీభవన్ రణరంగంగా మారింది. అధిష్ఠానం దూత దిగ్విజయ్ సింగ్ ఎదుటనే నేతలు అరుపులు, నినాదాలు, ధర్నాలతోరచ్చ రచ్చ చేశారు. పలువురు నేతలు గల్లాలు పట్టుకుని దాడులకు దిగారు.
- తాజాగా ఎన్నికలకు నోటిఫికేషన్ రాక ముందే గాంధీభవన్‌లో ధర్నాలు, నిరసనలు, ఘర్షణలు, నినాదాలు, పిడిగుద్దులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. టిక్కెట్లు రానివారు, అసంతృప్త నేతలు గాంధీభవన్‌పై దండెత్తి ఆగ్రహాన్ని వెళ్లగక్కుతున్నారు.

మొదటి నుంచి అదే ధోరణి

కాంగ్రెస్ రక్తంలోనే ఇలాంటి ఘర్షణపూరిత లక్షణాలు ఉన్నాయని ఆ పార్టీ చరిత్ర తెలుసుకొంటే అర్థమవుతుంది. మొదట్లో భౌతిక దాడుల సంస్కృతి లేకున్నా.. రాను రాను ఇలాంటి సంస్కృతికి కాంగ్రెస్ నేతలు, వారిని వెన్నంటి ఉండే కార్యకర్తలు అలవాటు చేసుకొన్నారు. పార్టీ విలువలకు కట్టుబడి ఉన్నవారికి కాకుండా.. రౌడీయిజం, దౌర్జన్యం, డబ్బులకు అమ్ముడుపోవడం, టిక్కెట్లు అమ్ముకొనేవారికి ప్రాధాన్యం ఇవ్వడంతో అందరూ అదేబాట పట్టారని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. పార్టీ అంతర్గత సమావేశాలైన